

చేతులు కలిసేదెప్పుడో!?

అధికార పార్టీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలక నేతల మధ్య విభేదాలు ఎంతకీ ఆగడం లేదు. ఏదో ఒక విషయంలో రచ్చ చోటుచేసుకుంటుండటంతో అటు పార్టీ వర్గాలు, ఇటు ప్రజల్లో ప్రజా ప్రతినిధుల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. అధిష్ఠానం జోక్యంతో సమస్య సద్దుమణిగినా, నేతలు మాత్రం ఐక్యంగా ముందుకు సాగడం లేదనే టాక్ వినబడుతోంది. తాజాగా మేడారం జాతర టెండర్ల విషయంలో మంత్రుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. దేవాదాయశాఖ టెండర్ల విషయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి తీరుపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తితో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారనే ప్రచారం హట్‌టాపిక్‌గా మారింది. సోమవారం మేడారంలో మంత్రులు పొంగులేటి, సీతక్క పర్యటించగా, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాత్రం కనిపించలేదు. ఆహ్వానం అందకపోవడం వల్లే ఆమె రాలేదని తెలుస్తోంది. గత మేడారం మహాజాతర సమయంలోనూ మంత్రుల మధ్య విభేదాలు అంతర్గత రచ్చచేశాయి. మరో మూడు నెలల్లో మహాజాతర జరగనుండగా... అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, ఏర్పాట్లపై ఈ అంతర్గత పోరు ఎలాంటి ప్రభావం చూపుతుందోనని ఆందోళన భక్తుల్లో వ్యక్తమవుతోంది.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

చిచ్చు రేపుతున్న మేడారం మహాజాతర అభివృద్ధి పనులు

- టెండర్ల విషయంలో మంత్రులు కొండా, పొంగులేటి మధ్య విభేదాలు
- సమస్య పరిష్కరించాలంటూ టీపీసీసీ చీఫ్‌కు మంత్రి సీతక్క లేఖ
- తాజాగా దేవాదాయ శాఖ మంత్రి సురేఖ లేకుండానే మంత్రులు పొంగులేటి, సీతక్క సమీక్ష
- గత జాతర సమయంలోనూ మంత్రుల మధ్య మనస్పర్థలు
- ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఇంకా కొనసాగుతూనే ఉన్న పాత విభేదాలు
- అధిష్ఠానం జోక్యం చేసుకున్నా కుదరని సయోధ్య

7

నేత్రపర్వంగా స్వామి వారికి చక్రస్నానం

ముగిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

జఫర్‌గడ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో స్వామి వారికి శాంతి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి స్వామి వారికి చక్రస్నానం, పుష్పయాగం ఉత్సవ కార్యక్రమాలు నేత్ర పర్వంగా జరిగాయి. కాగా, ఆదివారం రాత్రి లక్ష్మీసమేతుడైన నరసింహస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి మేళ తాళాలు, మహిళలు కోలాట నృత్యాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు, మహిళలు విశేష సంఖ్యలో హాజరై కనులారా వీక్షించి తరించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన స్వామి వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, అర్చక వేద పండితులు తయ్యాల కృష్ణమాచార్యులు, పాడిచేటి శ్రీనివాసాచార్యులు, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

చెరువులు ఎప్పుడు నిండే ఉండాలి

- సన్న, దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి
- సాకులు చూపకుండా ధాన్యం కొనుగోలు చేయాలి : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బచ్చన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బచ్చన్నపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతంలో చెరువులు ఎప్పుడూ నిండి ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, తద్వారా రెండు పంటలు పండే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు తమ్మడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో వడ్లు పండించే రాష్ట్రాల్లో తెలంగాణ 14వ స్థానంలో ఉండేదని, దాన్ని మొదటి స్థానంకు తీసుకురావటానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ స్థానాన్ని అలాగే కొనసాగించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేట్టాలన్నారు. ప్రభుత్వం సన్న ధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తానని హామీ ఇచ్చి, విస్మరించిందని మండిపడ్డారు. ఈ ప్రాంత రైతాంగం దొడ్డు వడ్లను అధికంగా పండిస్తారని, వాటికి బోనస్ ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తరుగు పేరిట కోతలు విధించి రైతును నష్టపర్చకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, రామానుజాచారి, ఎంపీడీవో (మిగతా 8వ పేజీలో)

వర్షంతో తడిసిన ధాన్యం





జనగామ ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఒక్కచోటుకు చేస్తున్న రైతు

జనగామ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో సోమవారం ఉదయం కురిసిన మోస్తరు వర్షం అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చింది. జనగామ మార్కెట్ ఆవరణలోని ఐకేపీ(కాటన్ యార్డు) కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం తడిసింది. ఐకేపీ కేంద్రానికి పెద్ద ఎత్తున ధాన్యం రావడం, కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో వడ్లు తలిసిపోయాయి. సీసీ కల్లాలు కావడంతో నీరు నిలిచి వడ్ల కుప్పలు నీటిలో తేలాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు తంటాలు పడ్డారు. సకాలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం నాయకుడు భూక్యా చందూనాయక్ ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి జీవన్‌కు వినతిపత్రం అందించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

\- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్ద నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, బెన్షాలోమ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వద్ద నుంచి 38అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక అర్జీని క్షుణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, డీఆర్‌డీవో వసంత, హౌసింగ్ పీడీ మాత్రునాయక్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్షాలోమ్‌లతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలన్నారు. సీజనల్, వైరల్ వ్యాధులు ప్రజలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఫీవర్ సర్వే చేపట్టి వైద్య పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, డీఆర్‌డీవో వసంత పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండెకు రక్షణ


గుండెపోటు వచ్చిన వ్యక్తులను రక్షించేందుకు ప్రతీ ఒక్కరు సీపీఆర్ శిక్షణ పొందాలని కలెక్టర్ సూచించారు. జాతీయ స్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 13 నుంచి 17 వరకు జాతీయ స్థాయిలో చేపట్టిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమంపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేయాలి

జిల్లాకు కేంద్రియ విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని నాగరత్న సేవా సం ఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బి ర్రు ఇస్తారి ప్రభుత్వాన్ని కోరా రు. ఈ మేరకు బిర్రు ఇస్తారి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిర్రు ఇస్తారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి నాలుగు విశ్వవిద్యాయాలు మంజూరు చేశాయన్నారు.

సారథి ఎవరో?

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికపై ఉత్కంఠ
- ముగిసిన డీసీసీ దరఖాస్తుల ప్రక్రియ
- మూడు నియోజకవర్గాల్లో అబ్జర్వర్ల అభిప్రాయ సేకరణ
- 30 వరకు దరఖాస్తులు
- ఏఐసీసీకి ఆరుగురి పేర్లతో ప్రతిపాదన..
- పేర్లు బయటికి పొక్కకుండా జాగ్రత్త
- మా నాయకుడికే పగ్గాలు అంటూ శ్రేణుల ప్రచారం



జనగామ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జనగామ కాంగ్రెస్ పీటం ఎవరిని వరించనుందోనన్న దానిపై ఇక ఉత్కంఠకు తెరలేచింది. డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల ప్రక్రియ, అభిప్రాయ సేకరణ ముగియడంతో పార్టీ జిల్లా బాధ్యతలు ఎవరికి దక్కుతాయన్న దానిపై కాంగ్రెస్‌లో విశ్లేషణలు ప్రారంభమ య్యాయి. తమ నాయకుడికి అంటే తమ నాయకుడికే డీసీసీ పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏఐసీసీ నియమించిన అబ్జర్వర్లు అధ్యక్ష పదవికి సంబంధించిన కసరత్తు పూర్తి చేసి బంతిని ఏఐసీసీ, టీపీసీసీ కోర్టులో వదిలారు. ఎన్నికకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. అధ్యక్ష ఎన్నికలో భాగంగా ఏఐసీసీ అబ్జర్వర్లను నియమించింది. 'సంఘటన్ సృజన్ అభియాన్' పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అబ్జర్వర్లు జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలను నిర్వహించి కార్యకర్తలు, నాయకుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. మూడు నియోజకవర్గాల్లో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి అధ్యక్ష పదవికి ఎవరయితే అర్హులన్న దానిపై అభిప్రాయాలు తీసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. పార్టీ బలోపేతం, పదవుల్లో సామాజిక సమతుల్యత, నాయకత్వ నిర్మాణం వంటి అంశాలపై విస్తృతంగా అబ్జర్వర్లు చర్చించారు. కాగా.. జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం సోమవారం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న వారితో ముఖాముఖిగా మాట్లాడారు. పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషి, ఏ విధంగా సమర్థులు, అధ్యక్ష పదవి ఇస్తే ఏ విధంగా పనిచేస్తారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆరుగురి పేర్లతో ప్రతిపాదన

జిల్లా అధ్యక్ష పదవికి సంబంధించి ఆరుగురి పేర్లను ఏఐసీసీకి ప్రతిపాదన పంపనున్నారు. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవికి 30 దరఖాస్తులు రాగా వీటిలో నుంచి ఆరుగురి పేర్లను ఏఐసీసీ, టీపీసీసీకి అబ్జర్వర్లు (మిగతా 8వ పేజీలో)

మచ్చల దుప్పి అనుమానాస్పద మృతి

- ఉచ్చుకు మృతి చెందిందా.. వేటగాళ్లు పడేసి పోయారా..
- విశ్వనాథపురంలో రోడ్డు పక్కన కళేబరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్వో కొండల్ రెడ్డి

6



మెడకు ఉచ్చుపడి మృతి చెంది ఉన్న మచ్చల దుప్పి

దాడి చేసిన వారిని శిక్షించాలి

జనగామ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్ గవాయిపై దాడికి యత్నించిన రాజేశ్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని ఎమార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునిల్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీల ధరించి ధర్నా చేపట్టి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సునిల్ మాట్లాడుతూ దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంతమందికి గిట్టాక దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాధిక్ అలీ, రాగళ్ల శ్రీహరిచ నాయకులు గద్దల కిషోర్, తాళ్లపల్లి కుమార్, బిర్రు నగేశ్, సందేన రవీందర్, జేరిపోతుల సుధాకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పక్కా ప్రణాళికతో మేడారం పనులు

- పటిష్టంగా మాస్టర్ ప్లాన్ అమలు
- 90 రోజుల్లో పూర్తి చేస్తాం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క
- మేడారం గద్దెల ప్రాంగణం అభివృద్ధి పనుల పరిశీలన
- సమ్మక్క- సారలమ్మలకు ప్రత్యేక పూజలు
- అధికారులతో సమీక్ష సమావేశం



మేడారం పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

తాడ్వాయి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను 90రోజుల్లో పూర్తి చేస్తామని రెవన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ములుగు కలెక్టర్ దివాకర, పూజారులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం హరిత హోటల్‌లో విలేకరులతో మంత్రులు మాట్లాడారు.

2026 జనవరి 28 నుంచి 31 వరకు జరగబోమే వనదేవతల మహా జాతర లోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికలు రూపొందించామన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు ఆరాధ్య దైవాలైన సమ్మక్క- సారలమ్మల దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పనులను ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఇతర రాష్ట్రాల్లో రాతి శిల్పాలు కటింగ్ వర్క్స్ జరుగుతున్నాయని అన్నారు. పనుల్లో వేగం పెంచి మహా జాతరకు ముందుగా పూర్తి చేస్తామని అన్నారు.

మహా జాతరకు ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే అన్నారు. అంతేకాకుండా దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 101కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో రూ. 51కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసం శాఖల వారీగా మరో రూ. 45కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మహా జాతరకు 107రోజుల సమయం ఉండగా 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. కాంట్రాక్టర్లను వెంటనే పనులు ముమ్మరం చేయాలని సూచించారు.

పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదు

మేడారం దేవస్థానం శాశ్వత అభివృద్ధి పనులను 100రోజుల్లో పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పనుల్లో అధికారులు వేగం పెంచాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి పనులను మూడు భాగాలుగా విభజించి చేపట్టాలని అన్నారు. గద్దెల ఆర్చి గేట్ నిర్మాణాలు, నూతన గద్దెల ఏర్పాటు, పరిశీలన భవనాలు, క్లౌడ్ (మిగతా 8వ పేజీలో)

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా సురేష్


మునిగె సురేష్

జనగామ కల్చరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా మునిగె సురేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15 నుంచి 19 వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే 23వ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు సురేష్ సాంకేతిక నిపుణుడిగా వ్యవహరిస్తారు. గతంలో కూడా సురేష్ అనేక రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సాంకేతిక నిపుణులుగా పని చేశారు. ప్రస్తుతం సురేష్ జనగామలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్నారు. సురేష్ ఎంపికపై జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, కోశాధికారి ఆవుల అశోక్, జనగామ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కైరిక హనుమంతరావు, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గోర్‌సింగ్, అసోసియేషన్ సభ్యులు కొండ రవి, రంజిత్, సుధారాణి, ప్రవీణ్, కిరణ్, ముజీబ్, దిలీప్ హర్షం వ్యక్తం చేశారు.

గురుకుల టీచర్‌కు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు


అవార్డులతో ఉపాధ్యాయుడు రజనీకాంత్

కాటారం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులానికి చెందిన ఆర్ట్ టీచర్, మైక్రో ఆర్టిస్ట్ ఆడెపు రజనీకాంత్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. ప్రఖ్యాత క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఆయన చోటు సంపాదించుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రజనీకాంత్ పెన్సిల్ గ్రాఫైట్ మొనపై 0.4మి.మీ, 0.2మి.మీ పొడవు, వెడల్పులతో అతి చిన్న జాతీయ పతాకాన్ని చెక్కినందుకు ఆయన రికార్డుకెక్కారు. క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ముంబయి ప్రధాన కార్యాలయ ప్రతినిధులు వికాస్‌బొండవే, పునీత్‌మాధవ్ ఈ మేరకు ఆన్‌లైన్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం పంపారు. మైక్రో ఆర్ట్ ద్వారా వివిధ అంశాలకు సంబంధించి విభిన్న ఆకృతుల్లో గణపతి విగ్రహాన్ని, చాక్‌పీస్‌లపై 78జాతీయ జెండాలను, 108శివలింగాలను చెక్కినందుకుగానూ రజనీకాంత్ ఇదివరకే తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, వికీపీడియాలో చోటు దక్కించుకోవడం విశేషం. క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదైన రజనీకాంత్‌ను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, వార్డెన్ బలరాం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి టాలెంటోత్సవ్‌లో విద్యార్థిని ప్రతిభ


సాత్వికకు షీల్డ్ అందిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

కాటారం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జాన్సన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ టాలెంటోత్సవ్-2025లో భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికి చెందిన ఆదర్శ స్కూల్ విద్యార్థిని సాత్విక ప్రతిభ చాటింది. పప్పెట్ షో విభాగంలో నీతి కథలను హృద్యంగా ప్రదర్శించి విజేతగా నిలిచింది. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతిని అందుకుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలలకు చెందిన 2,500 మంది విద్యార్థులు ఈ టాలెంటోత్సవ్‌లో పాల్గొనగా పప్పెట్ షోలో సాత్విక విజేతగా నిలవడంతో ఏపీ విద్యాశాఖ ముఖ్య సలహాదారు రామ్‌కమల్, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, డాక్టర్ రాధా ప్రత్యేకంగా అభినందించారు. విజేతగా నిలిచిన సాత్వికను స్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, గైడ్ టీచర్లు బీపీ రావు, అక్బర్, లావణ్య సోమవారం సత్కరించారు.

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించే పార్టీ కాంగ్రెస్

● నిబద్ధత గల వారికే జిల్లా అధ్యక్ష పదవి ● అందరి అభిప్రాయం మేరకే ఎంపిక ● ఏఐసీసీ అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్ అబ్రహం

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించేది కాంగ్రెస్ మాత్రమేనని ఏఐసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిశీలకుడు జాన్సన్ అబ్రహం అన్నారు. జిల్లా అధ్యక్ష పదవి ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కమిటీలను బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. దేశ వ్యాప్తంగా జిల్లాల వారీగా కమిటీల ముఖ్యనాయకులను ఎంపిక చేసే ప్రక్రియను అబ్జర్వర్లకు పార్టీ అప్పగించిందని తెలిపారు. ఈ క్రమంలోనే భూపాలపల్లిలో జిల్లా అధ్యక్ష పదవిని అందరి అభిప్రాయాల సేకరణ అనంతరం ఎంపిక చేస్తామన్నారు. అత్యంత పారదర్శకంగా, నిబద్ధతతో ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. ఈ అభియాన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, యూత్ వంటి అన్ని వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పార్టీ పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి, నిబద్ధత కలిగిన నాయకుడిని సూచిస్తే వారినే అధ్యక్షుడిగా ఎన్నుకుంటామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నాటి నుంచి ఎన్నో ప్రాణత్యాగాలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. అలాగే రాహుల్ గాంధీకి రెండుసార్లు పీఎంగా అవకాశం వచ్చినా ఆ పదవిని తృణప్రాయంగా వదిలివేసి అర్హత కలిగిన వారిని ఆ స్థానంలో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. 2029లో ఈ దేశాన్ని దోపిడీ దొంగల నుంచి ప్రజలకు విముక్తి కలిగేలా తీర్పు ఇవ్వాలని అన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండే పార్టీ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అబ్జర్వర్లుగా అఫ్సర్ జాసువి, సాగరికారావు, నాగేందర్‌రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ సుబ్బారావు, సంజీవ్ ముదిరాజ్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, ముంజాల రవీందర్, శిరుప అనిల్, అప్పం కిషన్, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో సీసీఎఫ్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

కృష్ణకాలనీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో అటవీశాఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం జోన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025ను సీసీఎఫ్ ప్రభాకర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే హాజరయ్యారు. వారు వాలీబాల్ ఆడి ఆకట్టుకున్నారు. క్రీడలు శరీర ధృడత్వానికి మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఇతర జిల్లాల డీఎఫ్‌వోలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 1.56లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 2.79 మీటర్లు నమోదైంది.

కాళేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు

మహదేవపూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో రూ.300 అభిషేక సేవలు ప్రారంభించినట్లు ఈవో మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ- సేవ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడగా ఎట్టకేలకు ప్రస్తుతం సేవలు ప్రారంభించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు హుండీ లెక్కింపు

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 15న నిర్వహించనున్నట్టు ఈవో మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీలు తెరిచి లెక్కింపు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలి

తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య


ఏటూరునాగారంలో సమావేశమైన తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఏటూరునాగారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్ అధ్యక్షతన సమావేశం జరిగిన సమావేశానికి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసీల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే అంశానికి ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని అన్నారు. వారి అభిప్రాయం మేరకు చేపట్టే ఉద్యమానికి అన్ని ఆదివాసీ సంఘాలు కలిసిరావాలన్నారు. ఆదివాసీ సంఘాల జేఏసీతో కలిసి పనిచేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ములుగు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా చందా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కావుల సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ఎట్టి రాజబాబు, సిద్ధబోయిన సర్వేశ్వరరావు, చింత సోమరాజు, కార్యదర్శులుగా పెండేకట్ల బాలరాజు, కూచుంటి చిరంజీవి, ఈక జగ్గారావు, వట్టం సురేష్, ప్రచార కార్యదర్శులుగా వాసం శ్రావణ్ కుమార్, జవ్వాజి రవి, చింత శ్రావణ్, వజ్జ రవి, కోశాధికారిగా సోలం సురేష్, సాంస్కృతిక కార్యదర్శిగా కోడె రవిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ పోడెం రత్నం, యాసం రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర్క యాదగిరి, గంజి రాజన్న, గంట సత్యం తదితరులు పాల్గొన్నారు.


అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

గంజాయి స్వాధీనం

ఏటూరునాగారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 330 గ్రాముల గంజాయిని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్. రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వాజేడు నుంచి ఏటూరునాగారం వైపు గంజాయి తీసుకువస్తున్నారనే సమాచారం ఎస్సైకు అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కలిసి మండలంలోని రొయ్యూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అటు వైపు రాగా వారిని విచారించారు.

వీరు వాజేడు గ్రామానికి చెందిన తన్నూరి భాను ప్రకాశ్, అదే గ్రామానికి చెందిన చిడం సురేందర్ కాగా గంజాయిని సరఫరా చేస్తున్నారని గుర్తించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ముత్తేబోయిన ప్రేమ్‌చందు అనే వ్యక్తి దగ్గర తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, ఏటూరునాగారంలో ఎక్కువ ధరకు అమ్ముకొనేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి సుమారు రూ. 13,500 విలువైన గంజాయితో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు ప్రధాన నిందితుడు ముత్తేబోయిన ప్రేమ్ చందు పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. ఈ తనిఖీలో కానిస్టేబుళ్లు సుధాకర్, సదానందం, గోపి, ధ్రువ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాలకుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి జీవనం సాగిస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురంనకు చెందిన మజ్జిగ అయిలుమల్లు, లలిత కుమారుడు రమేష్(40) ఏడాది క్రితం హైదరాబాద్‌కు వెళ్లి బొలేరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబంతో బోడుప్పల్‌లో ఉంటున్నాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి వాహనాన్ని పెద్ద అంబర్‌పేట్‌లోని యజమాని ఇంటివద్ద పార్క్ చేసి బోడుప్పల్‌లోని ఇంటికి వచ్చేందుకు ఆటోకోసం నడుచుకుంటూ వస్తుండగా, వెనుకనుంచి కారు ఢీకొట్టడంతో రమేష్ మృతి చెందాడు. రమేష్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

అనుమానాస్పద స్థితిలో మచ్చల దుప్పి మృతి

● ఉచ్చుకు మృతి చెందిందా.. వేటగాళ్లు పడేసి పోయారా..
● జనగామ జిల్లా విశ్వనాథపురంలో రోడ్డు పక్కన కళేబరం


మృతి చెందిన మచ్చల దుప్పిని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో కొడంలొరెడ్డి, ఇన్‌సెట్‌లో కత్తిరించబడి ఉన్న దుప్పి కొమ్ము

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మచ్చల దుప్పి మృతి చెందిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎస్సీకాలనీలో ఘన్‌పూర్-జఫర్‌గడ్ రోడ్డు పక్కన సుమారు క్వింటా బరువు గల మగ దుప్పి మృతి చెంది ఉండడాన్ని ఉదయం స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్ఆర్వో కొండల్ రెడ్డి, ఎఫ్ఎస్‌వో రుబీనా, ఎఫ్‌బీవో రమేష్‌లకు అక్కడికి చేరుకొని దుప్పిని పరిశీలించారు. దుప్పి మెడకు బిగుతుగా ఐరన్ తీగ ఉచ్చుపడి, సుమారు 5 మీటర్ల పొడవుతో తీగ ఉంది. వేటగాళ్లు అడవి జంతువుల కోసం ఉచ్చు పెట్టడంతో ఉచ్చుకు దుప్పి చిక్కుకొని భారీ పరిమాణంలో ఉండడంతో ఉచ్చు తెంపుకొని పరుగెత్తే క్రమంలో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. లేదంటే వేటగాళ్లు దుప్పిని పట్టుకొని ఏదైనా వాహనంలో గ్రామం మీదుగా హైదరాబాద్‌కు తరలించే క్రమంలో పట్టుపడుతామని భయపడి ఇక్కడ పడవేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం అధికారులు దుప్పిని జఫర్‌గడ్ ప్రాంతంలోని అటవీ భూములలోకి తీసుకువెళ్లి వెటర్నరీ డాక్టర్ మౌనికతో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు.

విషయమై డాక్టర్ మౌనికను సంప్రదించగా దుప్పికి సంబంధించిన శాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్టు పేర్కొన్నారు. ఉచ్చుకు చిక్కుకొని పారిపోయివచ్చి మృతి చెందిందా, లేదా వేటగాళ్లు పట్టుకువచ్చి ఇక్కడ పడేశారా అన్నది రిపోర్టు వచ్చాక తెలుస్తుందన్నారు.

సీల్ వేసి ఉన్న యంత్రాలనే ఉపయోగించాలి

జిల్లా తూనికల కొలతల అధికారి ఝాన్సీ


వేయింగ్ యంత్రాలను సరిచూసి సీల్ వేస్తున్న జిల్లా అధికారి ఝాన్సీ

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూనికల కొలతల శాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేసి, సీల్ వేసి ఉన్న యంత్రాలనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వినియోగించాలని జిల్లా తూనికల కొలతల అధికారి ఝాన్సీ స్పష్టం చేశారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో స్టోర్‌రూమ్‌లో ఉన్న వేయింగ్ మిషన్‌లను పరిశీలించి. ఒక్కో మిషన్ రీడింగ్‌ను సరిచూసి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలను పండించిన రైతులకు ధాన్యం తూకం విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా మిషన్లను తనిఖీ చేసి సరి చేయడం జరిగిందన్నారు. సీల్ వేసిన మిషన్లను వ్యవసాయ మార్కెట్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, జఫర్‌గడ్ మండలాలకు పంపించనున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రీడలకు ఎంపిక


వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు తేజశ్రీ, మౌనిక


కబడ్డీకి ఎంపికైన సహనిక

లింగాలఘణపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆసర్ల తేజశ్రీ, కాలీ మౌనిక ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో పడాల విష్ణుమూర్తి సోమవారం తెలిపారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. 14న వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబర్చిన పీవీఆర్ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థిని కొమ్ము సహనిక ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ పప్పు వెంకటరెడ్డి తెలిపారు. 14న ములుగు జిల్లా జాకారంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సహనిక హాజరుకానుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడియత్నానికి నిరసనగా కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. దాడికి యత్నించిన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మడిపల్లి శ్యాం, రాజేందర్, నరేష్, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6930	5300
మక్కలు	2030	1521
కందులు	5412	3022
పెసళ్లు	4222	3022
పల్లికాయ (సూక)	6700	3500
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	10225	9869
పసుపు (గోల)	9608	8906
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	16300	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

నాలుగు ఉద్యోగాలు సాధించి.. ఆదర్శంగా నిలిచి..

ట్రాక్‌మెన్ నుంచి ఎంపీవో స్థాయికి..
యువతకు స్ఫూర్తిగా నిలిచిన చెన్నూరుకు చెందిన శ్యాంకుమార్



పాలకుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది చదువుకున్న యువత కల. ఇందుకోసం ఏళ్ల తరబడి ప్రయత్నం చేస్తూనే ఉంటారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఉద్యోగం సాధించడం అసాధ్యమేమీ కాదని కొందరు నిరూపిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు ఉద్యోగులు సాధించి చెన్నూరుకు చెందిన నారగాని శ్యాంకుమార్ ఔరా అనిపించాడు. మొదటి రైల్వేలో ఉద్యోగం సాధించి, తర్వాత ఎక్సైజ్ కానిస్టేబుల్ అనంతరం గ్రూప్-4, ఇటీవల విడుదలైన గూప్-2లో ర్యాంక్ సాధించి ఎంపీవోగా ఎంపికయ్యాడు. వివరాల్లోకి వెళితే..

పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన నారగాని రాములు, యాకలక్ష్మీ దంపతులకు కుమారుడు శ్యాంకుమార్, కుమార్తె ఉన్నారు. తండ్రి గీత వృత్తిని చేసుకుంటూ పిల్లల్ని పోషించాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు గ్రామం లోని ఓ ప్రైవేటు పాఠశాలల్లో చదివాడు. టెన్త్‌లో 9.8జీపీఏ, హన్మకొండలోని ప్రైవేటు కళాశాలలో చదివి 973 మార్కులు సాధించాడు. డిగ్రీ హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చదివాడు. డిగ్రీ చివరి సంవత్సరం(2019)లో ఆర్‌ఆర్‌బీ పరీక్ష రాసి ట్రాక్‌మెన్‌గా ఎంపికయ్యాడు. అది చేసుకుంటూనే 2023లో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా గ్రూపు-4 పరీక్ష రాసి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్(2024లో)గా కొలువు సాధించాడు. జనగామ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూనే గ్రూపు-2 పరీక్షకు సిద్ధమయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో 316 ర్యాంకు సాధించి, ఎంపీవోగా ఎంపికయ్యాడు. సర్కార్ కొలువు ఒక్కటి రావడమే కష్టమైన ఈ రోజుల్లో నాలుగు ఉద్యోగాలు సాధించి.. శ్రమిస్తే ఏది అసాధ్యం కాదని శ్యాంకుమార్ నిరూపించాడు.



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ పాండురంగారావు



రామప్ప దేవాలయం ఆవరణలో వలంటీర్లతో ప్రొఫెసర్లు, కళాకారులు

కాకతీయుల ఖ్యాతి విశ్వవ్యాప్తం

రామప్ప ఆర్కిటెక్ట్ అద్భుతం



- అలీ మొరాజీగంజ్, ఇరాన్

రామప్ప ఆర్కిటెక్ట్ అద్భుతం. వేయిస్తంభాల గుడి, కల్యాణ మండపం అలనాటి కళా నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. వేల సంవత్సరాల నాటి పాండవులగుట్టలోని సహజసిద్ధమైన శిలాతోరణాలు, వివిధ కట్టడాలు కళాకారుల ప్రతిభకు సజీవసాక్ష్యాలు. ఈ శిబిరంతో భారతదేశంలోని కళా నైపుణ్యం తెలుసుకునే అవకాశం రావడం సంతోషంగా ఉంది. భారతదేశ సంస్కృతి చాలా బాగుంది.

ప్రతాపరుద్రుడి చరిత్రను తెలుసుకున్నా



- రఫ్సాల్‌సింగ్, పంజాబ్

809 సంవత్సరాల క్రితం కాకతీయులు ఏలిన ప్రతాపరుద్రుడి చరిత్రను రామప్ప దేవాలయంలో ఏర్పాటు చేసిన శిలాశాసనంపై చూశాను. లిపి ద్వారా తెలుసుకోవడం ఆనందంగా ఉంది. హెరిటేజ్ క్యాంపునకు రావడం వల్ల రామప్ప చరిత్రతోపాటు ములుగు జిల్లాలో ఉన్న అనేక కాకతీయ కట్టడాల గురించి తెలుసుకున్నాను. ఆర్ట్, ఆర్కిటెక్చర్‌పై అమితమైన ఆసక్తి పెరిగింది.

మదనిక శిల్పాలు అద్భుతం



- ప్రజ్ఞ, ఢిల్లీ

రామప్ప ఆలయం ముందుభాగంలో ఉన్న 12 మదనికలు మమల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. శివలింగానికి ముందుభాగంలో ఉన్న నందీశ్వర విగ్రహాన్ని డోలరైట్ స్టోన్‌తో చెక్కడం గొప్ప కళా నైపుణ్యం. అలాగే క్యాంపు ద్వారా అనేక విషయాలతోపాటు రామప్ప సరస్సు ప్రాంతం, రామప్ప సరస్సును నిర్మించిన వారి చరిత్ర కూడా ఈక్యాంపు ద్వారా తెలుసుకున్నాం.

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి



- కౌశికభట్, డెహ్రాడూన్

ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. రవాణా సౌకర్యంతోపాటు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. రామప్ప రమణీయతను నేను మా ప్రాంతంలో తెలియజేస్తాను. మరోసారి కూడా రామప్ప క్యాంపునకు వస్తాను. అంతర్జాతీయ పర్యాటకులు వచ్చే సంఖ్యను క్రమంగా పెంచేలా చేయాలి.

కాకతీయుల ఖ్యాతిని మరింత విస్తరిస్తాం



కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా గత నాలుగు సంవత్సరాల నుంచి దేశ విదేశాలకు చెందిన వలంటీర్లకు ఉచిత శిక్షణ అందిస్తున్నాం. కాకతీయుల ఖ్యాతిని మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. వలంటీర్లకు చరిత్ర, ఆర్కియాలజీ, హెరిటేజ్, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజనీరింగ్, టూరిజం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. సుమారు 20మంది ప్రొఫెసర్లు వారికి శిక్షణ ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం. రామప్ప ఖ్యాతిని మరింత పెంచుతాం.

- బియ్యాల పాపారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి

ఇలాంటి శిక్షణలు ఎంతో అవసరం



రామప్ప సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి శిక్షణలు దోహదపడుతాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా అనేకమంది వలంటీర్లకు శిక్షణ అందిస్తున్నాం. కాతీయుల కట్టడాలు, చరిత్రను భావితరాలకు అందించేందుకు మా ట్రస్ట్ ముందుంటుంది.

- జనగాం శ్రీధర్‌రావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు, శిక్షణ కోఆర్డినేటర్

వినూత్న ఆవిష్కరణలకు పునాది



కొత్త ఆలోచనలు, వినూత్న పరిశోధనలు హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ వలంటీర్లకు పునాది వేస్తుంది. పరిశోధక విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రామప్పలో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం ఇది నాలుగోసారి. ప్రస్తుతం ఈ క్యాంపునకు ఇరాన్‌కు చెందిన ముగ్గురు వలంటీర్లు రావడం వారికి మంచి అవకాశం. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

- సూర్యకిరణ్, టూరిజం ప్రమోటర్

రామప్ప ఆలయంలో హెరిటేజ్ క్యాంపు



వలంటీర్లకు శివతాండవం గురించి వివరిస్తున్న పేరిణి నృత్య కళాకారుడు

- శిక్షణకు 12 రాష్ట్రాల నుంచి 38 మంది వలంటీర్ల రాక
- ఈ నెల 17 వరకు కొనసాగనున్న శిబిరం
- ఆలయ విశిష్టతను కొనియాడిన శిక్షణార్థులు

వెంకటాపూర్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింత చాటి చెప్పాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సంకల్పించింది. ఇందులో భాగంగా దేశ విదేశాల వలంటీర్లకు అవగాహన కల్పించేందుకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, ఇంటాక్ ఐకోమస్, తెలంగాణ టూరిజం, ఎస్ఆర్ఐ సీటీ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 8న క్యాంపు ప్రారంభం కాగా 17వ తేదీ వరకు కొనసాగనుంది. రామప్ప ఆలయ వాస్తుశిల్పం, నిర్మాణ సాంకేతికత, వారసత్వ నిర్వహణ, జియో ఇంజనీరింగ్ అంశాలపై వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నారు. కాకతీయుల పరిపాలన, పట్టణ ప్రణాళిక, రుద్రేశ్వరాలయ ఔన్నత్యం, ట్యాంక్, టౌన్, టెంపుల్ (టీటీటీ) అంశాలను వక్తల ప్రసంగాల తెలుసుకున్నారు. రేచర్ల రుద్రయ్య 1213లో కాకతీయుల కాలంలో నిర్మించిన శైవ దేవాలయాల్లో రామప్ప ఒకటి. ఈ అద్భుతమైన ఆలయ చరిత్ర తెలుసుకోవడం కోసం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేపట్టిన ఈ శిక్షణలో ప్రపంచ నలుమూలల నుంచి 38 మంది వలంటీర్లు పాల్గొంటున్నారు. వీరిలో ముగ్గురు ఇరాన్ దేశానికి చెందిన వారు ఉండటం విశేషం. శిక్షణలో పాల్గొంటున్న వలంటీర్లను పలకరించినప్పుడు తమ అభిప్రాయాలను తెలియజేశారు.



వలంటీర్లకు యోగాసనాలు చేయిస్తున్న యోగా గురువు రాంబాబు



పరిశీలనకు వచ్చిన ఢిల్లీ అధికారి హసన్‌తో ఐనవోలు పోలీసులు

జాతీయ స్థాయిలో టాప్‌-10 కోసం పోటీ

- ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎంహెచ్‌ఏ ఎవాల్యుయేషన్ అధికారి
- ఉత్తమ ప్రమాణాల కోసం కసరత్తు

ఐనవోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపికలో ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను కేంద్ర హోం మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్) ఎవాల్యూయేషన్ అధికారి సయ్యద్ మహ్మద్ హసన్ సోమవారం సందర్శించారు. ఏటా జాతీయస్థాయిలో చేపట్టే ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక పోటీలో ఐనవోలు పోలీస్‌స్టేషన్ 2024-25 సంవత్సరానికి ఆన్‌లైన్ రికార్డుల నమోదులో ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇలా జాతీయస్థాయిలో మొత్తం 78 పోలీస్‌స్టేషన్లను ఎంపికచేయగా దేశంలో తెలంగాణ 3వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మూడు పోలీస్‌స్టేషన్లు ఎంపిక కాగా అందులో ఐనవోలు ఒకటి. ఈ 78 పోలీస్‌స్టేషన్లలో ఐనవోలు పీఎస్‌ను టాప్‌-10లోకి ఆ శాఖ సూచించిన ప్రమాణాలకు తగ్గట్టుగా తీసుకురావడం కోసం ఎస్సై పస్తం శ్రీనివాస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు కృషి చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారి హసన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఇందులో ఉత్తమ పోలీస్‌స్టేషన్ పోటీలో మంచి ర్యాంకింగ్ కోసం ఆ శాఖ సూచించిన 19 అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

రెండు సంవత్సరాల రికార్డును పరిశీలించాం..

ఢిల్లీ అధికారి మహ్మద్ హసన్ విలేకరులతో మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ నిబంధనల మేరకు 2 సంవత్సరాల రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా గుర్తించిన 78పోలీస్‌స్టేషన్లలో రాష్ట్రం నుంచి ఐనవోలు, శామీర్‌పేట్, పలిమెల పోలీస్‌స్టేషన్లు ఉన్నట్లు వెల్లడించారు. నవంబర్ లేదా డిసెంబర్‌లో టాప్‌- 10 పోలీస్‌స్టేషన్లను హోం శాఖ ప్రకటించనున్నట్లు తెలిపారు. టాప్‌-10లో చోటు వస్తే పోలీస్‌స్టేషన్‌కు మోడల్ స్టేషన్‌గా ప్రశంసాపత్రం అందుతుందన్నారు. టాప్‌-3 వస్తేఎస్‌హెచ్‌వోకు అవార్డు అందించనున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్ పనితీరు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తంశ్రీనివాస్ పాల్గొన్నారు. ర్యాంకింగ్ కోసం కృషి చేసిన స్థానిక ఎస్సై పస్తం శ్రీనివాస్, సీఐ రాజగోపాల్, సిబ్బందిని డీసీపీ, ఏసీపీ అభినందించారు.

చేతులు కలిసేదెప్పుడో!?

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- చిచ్చు రేపుతున్న మేడారం మహాజాతర అభివృద్ధి పనులు
- టెండర్ల విషయంలో మంత్రులు కొండా, పొంగులేటి మధ్య విభేదాలు



మేడారం మహజాతరను ప్రభుత్వం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే జనవరి 28నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహజాతర జరగనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను కేటాయించింది. వీటితో పాటు తల్లుల గద్దెలను గ్రానైట్‌తో ఆధునీకరించటంతో పాటు ఒకే వరుసలో ఉండేలా డిజైన్ రూపొందించారు. అంతేకాకుండా గద్దెల సాలారాన్ని కూడా ఎటూ 20ఫీట్ల వరకు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించారు. గత నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. మహజాతర గద్దెల విస్తరణ, ఆధునీకరణపై ఆదివాసీలు, పూజారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వంద రోజుల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం మహజాతరను వైభవంగా నిర్వహించేందుకు ఎంతో ఉత్సాహంగా ఉండగా స్థానికంగా రాజకీయాలు చికాకు తెప్పిస్తున్నాయనే చర్చ జరుగుతుంది. ప్రధానంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రాధాన్యత తగ్గిస్తున్నారని ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేశారు. సుమారు రూ.71కోట్లతో చేపట్టే ఈ పనులను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సొంత కంపెనీకి తనకు తెలియకుండా టెండర్లు ఇప్పించుకున్నారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహంతో ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో పొంగులేటిపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలకు కొండా దంపతులు ఫిర్యాదు చేశారని ప్రచారం జరిగింది. అయితే తాము ఎవరికీ ఫిర్యాదు చేయలేదని కొండా దంపతులు చెప్పుతున్నప్పటికీ తన శాఖపై ఇంకొక మంత్రి పెత్తనం ఏమిటని కొండా గుర్రుగా ఉన్నట్లు రాజకీయవర్గాల్లో టాక్ వినబడుతుంది. ఇదే సమస్యపై మంత్రి సీతక్క కూడా తనకు ఫిర్యాదు చేసిందని, ఇది తమ పార్టీ అంతర్గత విషయమని, సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటామని స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ప్రకటించారు. అయితే తాను ఎవరిపై ఫిర్యాదు చేయలేదని, మేడారం ప్రతిష్ట దెబ్బతినకుండా ఇద్దరు మంత్రుల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించాలని మాత్రమే మహేష్‌గౌడ్‌ను కోరినట్లుగా సీతక్క ఆ తరువాత వివరణ విడుదల చేశారు.

2024 మేడారం జాతర సమయంలోనూ కొండా సురేఖ, సీతక్క మధ్య విభేదాలు ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ లేకుండానే మేడారం జాతర సమీక్షలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి 2024 ఫిబ్రవరి 23వ తేదీన మేడారం జాతరకు వస్తే.. అదే రోజు సీఎంతో కలిసి సురేఖ హాజరయ్యారు. ఆరోగ్య సమస్యల వల్లే కొంత దూరంగా ఉన్నానని అప్పట్లో మంత్రి చెప్పినప్పటికీ మంత్రుల మధ్య విభేదాలే కారణమనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం కూడా మళ్లీ మంత్రుల మధ్య విభేదాలు తెరపైకి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

సురేఖకు ఆహ్వానం లేదా..?

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దనసరి అనసూయ సోమవారం మేడారంలో పర్యటించారు. సమ్మక్క, సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించి జాతరలో చేపట్టే పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. అయితే కీలకమైన ఈ పర్యటనలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కనిపించకపోవటం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయశాఖ మంత్రిగా, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రిగా కొండా సురేఖ మేడారం పర్యటనలో పాల్గొనాల్సి ఉండగా, ఆహ్వానం అందకపోవటంతోనే మేడారం పర్యటనకు దూరంగా ఉన్నారనే చర్చ జరుగుతుంది.


గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో నాలుగు సార్లు మేడారం మహజాతరను నిర్వహించారు. ఏ కీలక శాఖ మంత్రి పర్యటనకు వచ్చినా.. జాతర పనులపై సమీక్ష నిర్వహించినా సంబంధిత శాఖ మంత్రితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యేవారని భక్తులు చర్చించుకుంటున్నారు. దేవాదాయశాఖ, గిరిజన శాఖ మంత్రులు సమీక్షలో పాల్గొనే వారనే టాక్ ఉంది. కోట్లాది మంది భక్తులు వచ్చే మేడారం మహజాతర పనుల సమీక్షకు మంత్రి సురేఖను ఆహ్వానించకపోవటం పట్ల కొండా వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమిష్టిగా మేడారం మహజాతర సమీక్షలో పాల్గొంటేనే పారదర్శకంగా పనులు జరుగుతాయని, ఏమైనా పొరపాట్లు ఉన్నా సీఎం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

విభేదాలకు ఫుల్‌స్టాప్ ఎప్పుడో..?

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలకు ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుందనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జోరుగా జరుగుతుంది. పదేళ్ల తరువాత అధికారంలోకి వస్తే.. గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకే వేదికపైకి వచ్చి.. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించుకున్న దాఖలాలు లేవనే చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటిరీ ఏదో రకంగా మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు రచ్చకెక్కుతుండటం క్యాడర్‌కు చిరాకు కలిగిస్తున్నాయనే టాక్ వినబడుతుంది. మేడారం జాతర విషయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ఇన్‌చార్జి మంత్రి సమన్వయంగా పని చేస్తేనే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత జాతరలో భక్తులు తాగునీటికి, మరుగుదొడ్లకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తల్లుల దర్శనానికి కూడా గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. గత జాతరకు కేటాయించిన నిధుల్లో సుమారు రూ.20కోట్ల పనులు కూడా అప్పట్లో పూర్తి చేయలేకపోయారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను పక్కన పెట్టి జాతర సక్సెస్‌పై దృష్టి పెట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.15 లక్షలతో కటాక్షపూర్ కాజ్‌వే నిర్మాణం


- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కటాక్షపూర్ కాజ్‌వే నిర్మాణంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ములుగు ప్రధాన రహదారిలో ఉన్న కటాక్షపూర్ కాజ్ వే నిర్మాణ పనులను రూ.15 లక్షలతో చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం కటాక్షపూర్ కాజ్ వే నిర్మాణానికి సంబంధించి సాగునీటి పారుదల, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కటాక్షపూర్ చెరువులోకి వరదనీరు ఎక్కడి నుండి వస్తుందని, కాజ్ వే నిర్మాణం చేపట్టడానికి నీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కటాక్షపూర్ చెరువులోకి ఎగువ ప్రాంతంలో ఉన్న మల్లంపల్లి వైపు నుంచి నీరు వచ్చి చేరుతుందని దీంతో చెరువులో నీరు ఎక్కువగా ఉండి కిందకు ప్రవహిస్తుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కటాక్షపూర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతీరోజు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పై నుంచి వరద వస్తున్న కారణంగా రహదారి దెబ్బతింటుందని తెలిపారు. కాజ్ వే నిర్మాణానికి ఎన్ని రోజుల సమయం పడుతుందని ఇరు శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ కటాక్షపూర్ వద్ద ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహాన్ని మళ్లించడం ద్వారానే కాజ్ వే నిర్మాణ పనులు సాధ్యమవుతాయన్నారు. కాజ్ వే నిర్మాణం కోసం కటాక్షపూర్ చెరువు పై నుండి వస్తున్న నీటి ప్రవాహాన్ని ఎలా కట్టడి చేయవచ్చో సాగునీటి పారుదల శాఖ అధికారులు సమగ్ర వివరాలను అందజేయాలన్నారు. వీలైనంత త్వరగా కాజ్ వే నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, జాతీయ రహదారుల శాఖ అధికారులు, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

● భీమునిపాదం హోరు



వర్షాలతో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతానికి వరద ఉధృతి పెరిగింది. దీంతో ఎత్తయిన గుట్టపై నుంచి జలపాతం దూకుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి బి.సురేష్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి, గూడూరు


జిల్లా స్థాయిలో ఎంపికైన బాలికలు

ఉత్సాహంగా పాఠశాల క్రీడలు

జనగామ కల్చరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ క్రీడలలో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా నుంచి 600 మంది క్రీడాకారులు, 60మంది వ్యాయామ విద్య ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో ఎంపికైన వారు ములుగు మండలం జాకారంలో నిర్వహించే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొంటారని పాఠశాల క్రీడల జిల్లా కార్యదర్శి జాటోత్ గోరేసింగ్ తెలిపారు. కార్యక్రమంలో పీఈడీలు కిష్టయ్య, గంగిశెట్టి మనోజ్‌కుమార్, కైరిక హనుమంతరావు, వీర్యా నాయక్, రమాదేవి, ఆవుల అశోక్, కిరణ్, జ్యోతి, శ్రీదేవి, మాధవి, సంగీతమాధురి, పద్మ, నరేష్, శ్రీనివాస్, మనోహర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్చురీలోనే మల్లయ్య మృతదేహం


మల్లయ్య(ఫైల్)

జనగామ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెయిల్ రా దేమోననే బెంగతో జనగామ సబ్ జైలులో ఆత్మహత్యకు పాల్పడిన రిమాండ్ ఖైదీ వారాల మల్లయ్య(42) మృతదేహం ఇంకా వరంగల్ ఎంజీఎం మార్చురీలోనే ఉంది. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తికాక పోవడంతో మృతదేహాని స్వగ్రామం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి తరలించలేదు. దీంతో అంత్యక్రియలు ఆలస్యం కానున్నాయి. మృతదేహానికి ఉస్మానియా, గాంధీ, కేఎంసీ వైద్యులు పోస్టుమార్టం చేయాల్సి ఉంది. దీంతో వారు సోమవారం రాకపోవడంతో పోస్టు మార్టం వాయిదా పడినట్లు తెలుస్తోంది. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాళ్ల నేలలో పంట సిరులు

నిరుపయోగ భూముల్లో పంటలు
అక్కపల్లిగూడెంలో 15 ఎకరాలు సాగులోకి..
'ఉపాధి' అవకాశాలను సద్వినియోగం చేసుకున్న రైతులు
ఫలించిన జీపీ కార్యదర్శి చొరవ


వినియోగంలోకి వచ్చిన భూమిలో రైతు వెంకటయ్య పత్తిసాగు


వినియోగంలోకి వచ్చిన భూమిలో రైతు మల్లయ్య సాగుచేసిన వరిపంట


మల్లయ్య భూమిలో రాళ్లు, రప్పలు, ముళ్ల చెట్లను తొలగిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాళ్లు, రప్పలు, ముళ్ల పొదలతో సాగుకు యోగ్యంగా లేని, పడావుపడిన నేలలు నేడు పచ్చని పంటలతో సిరుల పంటలకు నిలయాలుగా మారాయి. కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పంటల్ని సాగుచేస్తూ ఔరా అనిపిస్తున్నారు మండలంలోని అక్కపల్లిగూడెం వాసులు. జీపీ సెక్రటరీ భారత అవినాష్ చొరవ అమోఘం. రాంచీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఎన్ఆర్ఈజీఎస్ పథకం ముసాయిదా బిల్లు రూపకర్తల్లో ఒకరైన జాన్‌డ్రీజ్ రాసిన వ్యాసంతో అవినాష్ ప్రేరణ పొందాడు. ఝార్ఖండ్‌లో పొలాల గట్ల వెంబడి, కొబ్బరి, మామిడి చెట్లను సాగుచేసి రైతులకు అదనపు ఆదాయం పొందవచ్చని వివరించి అక్కపల్లిగూడెం రైతులతో వాటిని నాటించి ఇప్పుడు సత్ఫలితాలను పొందారు.

15 ఎకరాలాలు సాగులోకి..

మట్టికొండలు, ఏనెల చుట్టూ ఉన్నటువంటి ఎకరాల కొద్ది నేలలు రాళ్లు, రప్పలు, ముళ్లపొదలతో, చెట్లతో నిరుపయోగంగాఉండేవి. సాగులోకి తెచ్చేందుకు రైతులకు ఆర్థిక భారం కావడంతో వదిలేశారు. ఈక్రమంలో ఉపాధి పనుల్లో భాగంగా భారీ గుంతలు తీయించి రాళ్లు, రప్పలను అందులో వేయించి, చదునుచేసి సాగులోకి తీసుకువచ్చారు. రెండేళ్లలో ఏకంగా 15 ఎకరాల భూమిని సాగులోకి తీసుకురావడం విశేషం. మిగితా 25 ఎకరాను సాగులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ వినియోగం అద్భుతం

అక్కపల్లిగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం వినియోగం అద్భుతంగా ఉందని ఎన్ఆర్ఈజీఎస్ డ్రాఫ్టింగ్ మెంబర్, రాంచీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ డ్రీజ్ ఇటీవల గ్రామంకు వచ్చిన సందర్భంలో కొనియాడారు. రాష్ట్రంలోఅక్కపల్లిగూడెంలో ఎకరాల కొద్ది నిరుపయోగంగా ఉన్న భూమి ఉపాధిహామీ పథకంలో వినియోగంలోకి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో ఉపాధిపనులను యంత్రాలతో నిర్వహిస్తూ అభాసుపాలు చేస్తున్నారని అందుకు భిన్నంగా గ్రామంలో పనులు జరుగడం అద్వితీయమని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో గ్రామానికి ఉపాధి పథకం ద్వారా నిధులు అందించేలా సహకరిస్తానని తెలిపారు.

ఉపాధి పనులపై ప్రశంసలు..

చిన్న గ్రామమైన అక్కపల్లిగూడెంలో ఉపాధిహామీ పనులు విజయవంతం కావడంతో రైతులు ప్రశంసలు పొందుతున్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో గతంలో సభ్యురాలుగా ఉన్న ఆశిమాగోయల్, సెంటర్ ఫర్ ఎకానమిక్ స్టాటిస్టికల్ స్టడీస్ (సీఈఎస్ఎస్) సెస్ డైరెక్టర్ రేవతి, ఢిల్లీలో పనిచేసే స్వాతంత్ర్య పరిశోధన సంస్థ లిబ్‌టెక్ ఇండియా ప్రతినిధులు చక్రధర్, బుద్ధ, వెంకట్ ఏకంగా గ్రామాన్ని సందర్శించారు. పనులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

రెండున్నర ఎకరాల భూమి సాగులోకి వచ్చింది..

మేడిద మల్లయ్య, రైతు, అక్కపల్లిగూడెం



అనేక ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఏనె భూమిలో కార్యదర్శి చొరవతో ఉపాధి పథకంలో పెట్టి పైసా ఖర్చు లేకుండా రాళ్లు, రప్పలు, ముళ్లచెట్లు తొలగించారు. దీంతో రెండున్నర ఎకరాల సాగులోకి వచ్చింది. రెండెకరాల్లో పత్తి చేనును సాగు చేశాను. క్రాప్ బాగా వచ్చింది.

రైతుల సహకారంతోనే సాధ్యం..

భారత అవినాష్, పంచాయతీ సెక్రటరీ



రైతుల సహకారం, ఉపాధి కూలీల తోడ్పాటుతో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న భూమిని సాగులోకి తీసుకు రావడం సాధ్యమైంది. పంటలను సాగుచేసుకొని ఫలితాలు పొందుతున్నారు. రాంచీ ప్రొఫెసర్ జాన్‌డ్రీజ్ గ్రామాన్ని పర్యటించి ఉపాధి పనులపై హర్షం వ్యక్తం చేయడం ఎన్నటికీ మరువను. ప్రతీ ఎకరాను వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నా.


సమావేశంలో మాట్లాడుతున్న లింగం

బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తాం..

తరిగొప్పుల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయబద్ధంగా అందాల్సిన 42శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలంతా ఏకతాటిపై వచ్చి ఉద్యమిస్తామని ముదిరాజ్ మహాసభ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలువేరు లింగం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పార్టీలకు అతీతంగా బీసీ ఉప కులాల నాయకులందరూ హాజరై రిజర్వేషన్ల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని తీర్మానించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి పోషయ్య గౌడ్, బూస యాదయ్య యాదవ్, కర్ణకంటి వెంకటేశ్వర్లు, నడిగోటు శ్రీధర్, అంకం శ్రీనివాస్, సుంకరి రవి, పాండ్యాల శ్రీను, జంపులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

పాలకుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ జిల్లా కార్యదర్శి దుంపల సంపత్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చట్ట బద్ధత లేని జీవోలను విడుదల చేసి బీసీలను మోసం చేయడానికేనని విమర్శించారు. సమగ్ర బీసీ కులగణన చేసిన సర్వే ఆధారాలతో సుప్రీం కోర్టులో నిరూపించి జనాభా ప్రకారం 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్, ఈర్ల రాజు, లాకావత్ రవి, గోనె అమరేందర్ ఉన్నారు.

బాలికలకు అవకాశాలు కల్పించాలి

రఘునాథపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికలకు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.మనోజ్ కుమార్ కోరారు. ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హబ్, స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, బాల్య వివాహాలు, మహిళ సాధికారత, సమాజ నిర్మాణంలో బాలికల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కేర్ వర్కర్ ప్రశాంత్, పవిత్ర, శీలరాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

థర్డ్ పార్టీ ఏజెన్సీలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాటల సోమన్న

జనగామ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలో థర్డ్‌పార్టీ ఏజెన్సీలను రద్దు చేసి, నేరుగా వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి వేతనాలను చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొట్ల వెంకటేష్ అధ్యక్షతన సోమవారం జిల్లా 2వ మహాసభ నిర్వహించగా ముఖ్యఅతిథిగా వెంకటేష్, సాంబయ్యలు హాజరై మాట్లాడారు. మార్కెట్ యార్డులలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక ఏజెన్సీలు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా జ్యాపం చేస్తున్నారన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెక్యూరిటీ గార్డులకు రూ. 26,000 ఇవ్వాలని, రూ. 5లక్షల ప్రమాద బీమా, ఇతర సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, సత్యనారాయణ, ప్రవీణ్, నిరోషా, రమేశ్, శ్రీనివాస్, సమీనా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


అంజయ్య కుటుంబానికి బియ్యం అందిస్తున్న వెంకటేశ్వర్లు

జఫర్‌గడ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాషబోయిన అంజయ్య కుటుంబాన్ని సోమవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన అంజయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి.వలీపాషా, కిసాన్ మోర్చా హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు దుస్స రాములు, బీజేవైఎం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి సురేశ్ గౌడ్, సీనియర్ నాయకులు ఎదులాపురం జయశంకర్, కాలువ రవి, యాకలక్ష్మీ, వల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ సోమవారం ఎంఈవో వెంకటరెడ్డికి వినతిపత్రం అందించారు. సెలవు రోజుల్లో సైతం ప్రైవేటు పాఠశాల నడుపుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీధర్, హరి, సతీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు టీకాలు

చిలుపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పంపిణీ చేసే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అనేశ్‌కుమార్ రైతులకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు ఆవులు, గేదెలకు టీకాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు


అన్నం బ్రహ్మరెడ్డి

జఫర్‌గడ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తమ్మడప ల్లి(జి)కి చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్నం బ్రహ్మరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఈ మేరకు ఆయన దరఖాస్తులను అందించా రు. పార్టీకి సేవలందిస్తున్న తనకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు.

బ్రహ్మరెడ్డి గతంలో స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, రైతు సమన్వయ సమితి జిల్లా కో-ఆర్డినేటర్‌గా పనిచేసి సేవలందించారు.

సారథి ఎవరో?

(5వ పేజీ తరువాయి)

పంపనున్నారు. పార్టీ బలోపేతం చేయగల సామర్థ్యం, గతంలో పార్టీకి చేసిన సేవలు, చేపట్టిన పదవులు, సమర్థత వంటి అంశాల ఆధారంగా ప్రతిపాదన ఉండనుంది. అబ్జర్వర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆరుగురిలో నుంచి ఒకరికి డీసీసీ అధ్యక్ష పదవి దక్కనుంది. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి ఆరుగురిని గుర్తించి టీపీసీసీ ద్వారా ఏఐసీసీకి పంపిస్తామని ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్ తెలిపారు. విలేఖరులతో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని తెలిపారు. పార్టీలో సమర్థులైన వారికి జిల్లా కమిటీలో చోటు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

చెరువులు ఎప్పుడు నిండే ఉండాలి

(5వ పేజీ తరువాయి)

మమతబాయి, ఏపీఎం మాదారపు రవి, పీఏసీఎస్ సీఈవో బాలస్వామి, నాయకులు ఇర్రి రమణారెడ్డి, పులిగిల్ల పూర్ణచందర్, గంగం సతీష్ రెడ్డి, దూడల కనకయ్యగౌడ్, కొండి వెంకటరెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, షబ్బీర్, వడ్డేపల్లి, మల్లారెడ్డి, గంధమాల నరేందర్, సీసీ సందుల నర్సింహులు, నిర్వహణ కమిటీల బాధ్యులు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట, తమ్మడపల్లితోపాటు కొడవటూరు, బసిరెడ్డిపల్లి, పోచన్నపేట, నారాయణపూర్ గ్రామాల్లో ఏపీఎం మాదారపు రవి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. సీసీలు సందుల నర్సింహులు, నంగునూరి సదానందం, బత్తిని యాదగిరి, బైరగోని విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో మేడారం పనులు

(5వ పేజీ తరువాయి)


గద్దెల ప్రాంగణంలో గంట కొడుతూ..

లైటింగ్, విద్యుత్, డ్రెయినేజీ, ప్రాకారం, ఉప మండపం, నూతన క్యూలైన్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ మేరకు మ్యాప్‌ల ద్వారా పనుల తీరును పరిశీలించారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కకు మేడారంలో ఘన స్వాగతం లభించింది. ముందుగా హెలీప్యాండ్ వద్ద అధికారులు మంత్రులను పూల బొకేలు ఇచ్చి స్వాగతించారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి వీరస్వామి, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మేడారంలోని దేవస్థానాన్ని మంత్రులు పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనులు పురోగతి వివరాలను తెలుకున్నారు. ఈ క్రమంలో నూతనంగా క్యూలైన్లపై నిర్మించిన షెడ్లు, శాశ్వత నిర్మాణాల పనులను పరిశీలించారు.

అనంతరం వనదేతలు పూజారులు తల్లుల కండువాలు కప్పి వారిని సన్మానించారు. మంత్రులు పూలు, పండ్లు పసుపు కుంకుమ ఎత్తు బంగారం సమర్పించి సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులతో మాట్లాడారు. గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దె మార్పు పనుల ఆరంభ సమయాలు, ఏర్పాట్లు తదితర అంశాల గురించి అడిగి తెలుకున్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కాక సారయ్య, కొక్కెర కృష్ణయ్య, రమేష్, కాక వెంకటేశ్వర్లు, అరుణ్, కిరణ్ ఉన్నారు.

కల్లాల్లో తడిసిన పంట


చిన్నరామన్‌చర్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళ రైతు బాలమణి

బచ్చన్నపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టాలు ఏదోఒక రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. సోమవారం కురిసిన వర్షానికి కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. ఆదివారం ఎండ ఉండటంతో మరుసటి రోజు ఆరబోసి కుప్పపోయాలని తలచిన రైతులకు అకాల వర్షం కన్నీరుని మిగిల్చింది. సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట, బచ్చన్నపేట, కట్కూరు తదితర గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది.

తడిసిన ధాన్యం కొనాలి..


మార్కెట్‌లో ధర్నా చేస్తున్నరైతు సంఘం నాయకులు

జనగామ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి జనగామ వ్యవసాయ మార్కెట్ ప్రధాన గేటు ఎదుట రైతులతో ధర్నా చేశారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి జీవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చందు మాట్లాడుతూ మార్కెట్‌లో వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, మ్యాచర్ వచ్చిన ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉర్సుల కుమార్, మంగ బీరయ్య, కనదుల వెంకన్న, బాల్దే అంజయ్య, రైతులు పాల్గొన్నారు.


యంత్రాలను అందిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్, కార్యదర్శి

రైతుల సంక్షేమానికి పెద్దపీట

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆవరణలో మార్కెట్ పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు యంత్రాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. గత ఏడాది నుంచి సన్నవడ్లకు బోనస్ ఇస్తుందని రైతులు బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు మండలాల పరిధిలోని మొత్తం 26 ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు, వేయింగ్ మిషన్‌లు, పాడి డ్రయర్‌లు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, ఇల్లెందుల బాబు, శ్రీనివాస్, సిబ్బంది షరీఫ్, ప్రవీణ్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం..

చిలుపూర్,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోమని బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు హెచ్చరించారు. సోమవారం చిన్నపెండ్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కేటాయించే 42శాతం రిజర్వేషన్లపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, జీవో 9 కోర్టులో నిలువదని తెలిసినప్పటికీ ఆర్భాటం చేసిందన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి క్రాంతి కుమార్, శాగ వెంకటేశ్వర్లు, వేమునూరి శ్రీనివాస్, పుప్పాల రవికుమార్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజన్‌బాబు

ఇంటి స్థలం ఆక్రమణను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న బాధితులు

రఘునాథపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో ఇంటి స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఖిలాషాపూర్‌కు చెందిన బాధితురాలు ఎలుమకంటి అమృతమ్మ విలేకరులతో సోమవారం తమ గోడును వెల్లబోసుకున్నారు. ఖిలాషాపూర్‌లో తమ ఇంటి స్థలం ఆవరణలో సోమవారం బాధితురాలు ఎలుమకంటి అమృతమ్మ, ఆమె కూతురు జిలుకర రేణుక, అల్లుడు కృష్ణాకర్ విలేకరులతో మాట్లాడారు. 40ఏళ్ల క్రితం ఖిలాషాపూర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తన భర్త వెంకటయ్యకు ఇంటి నిర్మాణం కోసం 200గజాల స్థలం కేటాయించారన్నారు. అప్పటి నుంచి ఇదే స్థలంలో రెండు గదులను నిర్మించుకొని ఉంటున్నామని, ఈ స్థలంను నకిలీ పత్రాలతో ఎలుమకంటి సుగుణమ్మకు చెందిన ఎలుమకంటి అనిల్, జిలుకర శ్రీనివాస్, జిలుకర సోమనాథం, జిలుకర శంకర్, మారపాక రమేష్ ప్రయత్నించగా, తన కూతురు, అల్లుడు అడ్డుకున్నారన్నారు. తమపై కృష్ణాకర్ దాడి చేసి గాయపర్చారని తప్పుడు డాక్టర్ సర్టిఫికెట్లను పోలీస్ స్టేషన్‌లో సమర్పించడంతో తన అల్లుడు కృష్ణాకర్‌కు 14 రోజుల రిమాండ్ విధించారని వాపోయింది. సుగుణమ్మకు చెందిన వారు గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతుల లేకుండానే 200 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని, దీంతో ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని వారికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారని వివరించారు.